

లింగారెడ్డిపేట్ గ్రామంలో నారుమడిని పరిశీలిస్తున్న ఏఈవో రాజాగౌడ్

## నారు మడుల పరిశీలన

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 18: పట్టణ పరిధిలోని లింగారెడ్డిపేట్ గ్రామంలో వరి నారుమడులను వ్యవసాయ విస్తీర్ణాధికారి రాజాగౌడ్ సోమవారం పరిశీలించారు. నారులో జింకులోపం ఉన్నట్లు గుర్తించారు. లీటరు నీటికి 2.5 గ్రాముల జింకు సల్ఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. నాటు వేయడానికి వారం రోజుల ముందు ఎకరానికి సరిపోయే నారుమడికి కేజీ కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను వేయాలని తెలిపారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

## రైతుబంధు దరఖాస్తుల స్వీకరణ

గాంధారి, డిసెంబర్ 18: కొత్తగా పట్టాదార్ పాస్‌బుక్కులు పొందినవారు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో నరేశ్ సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతుబంధు కోసం పట్టాపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను ఏఈవోలకు అందజేయాలని సూచించారు.

## ముగ్గురు బడిబయటి పిల్లల గుర్తింపు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 18: ఎల్లారెడ్డి మండలం కళ్యాణి గ్రామంలో సీఆర్‌పీ మహిపాల్ సోమవారం బడిబయటి పిల్లల సర్వే నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి విద్యార్థుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ముగ్గురు బడిబయటి పిల్లలను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలను కళ్యాణి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో చేర్పించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, రవీందర్, ఉపాధ్యాయుడు వీరయ్య ఉన్నారు.



పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న సీఆర్పీ మహిపాల్

# భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి

### అయ్యప్ప ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డి రూరల్/పిట్లం, డిసెంబర్ 18: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఎల్లారెడ్డి పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయంలో పూజారి ముత్యాల శ్రీనివాసరావు, గురుస్వామి చంద్రం, సుబ్రహ్మణ్య ఆలయ దాత కోటోజు సుగుణాకర్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలంకరణ, అష్టోత్తర శతనామావళి, హారతి, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. అభిషేకం నిర్వహించిన పాలతో తయారుచేసిన ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు హనుమంతప్ప, శంకర్‌రావు కులకర్ణి, అవుసుల సంతోష్, గోజె అమృత్‌రావ్, శ్రీకాంత్‌రెడ్డి, వీరాంజనేయులు, ఓర భీమయ్య, ప్రశాంత్‌గౌడ్, నాగం సాయిబాబా, బొండ్ల సాయిలు, సుభాష్, ఓర సంతోష్, అవుసుల విఠల్, పాపిని రామ్ చరణ్, బాలాగౌడ్, భక్తులు పాల్గొన్నారు.

పిట్లం మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ ఆవరణలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.



ఎల్లారెడ్డి అయ్యప్పస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



పిట్లంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గాంధారిలోని ప్రధాన రహదారిపై నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

## ఆటో డ్రైవర్లకు జీవన భృతి కల్పించాలి

గాంధారి, డిసెంబర్ 18: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన మహాలక్ష్మి పథకంతో నష్టపోతున్న తమకు జీవనభృతి కల్పించాలని మండలంలోని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలంటూ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై సోమవారం ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక నెహ్రూ విగ్రహం వద్ద రాస్తారోకో చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పిచడంతో ఆటోల్లో ఎక్కడం లేదని తెలిపారు. రోజంతా ఆటో నడిపితే రూ.500 సంపాదించే తమ ఉపాధికి గండి పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్‌కు సరిపడా డబ్బులు కూడా రావడంలేదన్నారు. ఆటోలను నమ్ముకొని జీవిస్తున్న తమ కుటుంబాలు మహాలక్ష్మి పథకం అమలుతో రోడ్డున పడ్డాయని తెలిపారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం రూ.15 వేల జీవన భృతి ఇచ్చి ఆదుకోవాలని కోరారు. తమకు న్యాయం చేయకపోతే ఆందోళనా కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

మద్నూర్, డిసెంబర్18: విద్యుత్ షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని చిన్న ఏక్లారా గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు, ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాములు(52) సోమవారం తన చేనులో మక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. చేను పారుతుండగా కరెంటు పోయింది. దీంతో రాములు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏదైనా సమస్య ఉందేమోనని చూసేందుకు వెళ్లాడు. అక్కడ ఉన్న హ్యాండిల్‌ను ముట్టుకోగానే షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మద్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## బస్సు ఢీకొని మరొకరు..

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 19: ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందిన ఘటన పెద్దకొడప్‌గల్ మండలంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దెలచెర్వు గ్రామానికి చెందిన బైరి సత్యాగౌడ్ (49) బైక్‌పై బిచ్కుంద వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని జగన్నాథ్‌పల్లి గ్రామ శివారులో ఉన్న రాజస్థాన్ దాబా సమీపంలో 161 జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఓవర్‌టేక్ చేస్తుండగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యాగౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# మండల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేద్దాం

### మద్నూర్ సర్వసభ్య సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్, డిసెంబర్18: నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మీబాయి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో విద్య, వైద్యం, రోడ్లు తదితర మౌలిక వసతులతోపాటు ప్రత్యేక శ్రద్ధతో ఒక్కొక్కటిగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. మండల అభివృద్ధి గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పూర్తి సమాచారంతో నివేదిక తీసుకురావాలని మండల విద్యాధికారి సూచించారు. వైద్యశాఖ అధికారులు సమావేశానికి రాకపోవడంపై రిపోర్ట్ తయారుచేసి పంపాలని ఎంపీడీవోకు సూచించారు. అంతకుముందు విద్య, వైద్యశాఖలకు సంబంధించిన సమస్యలను పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. సమావేశంలో జడ్పీటీసీ అనిత, ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్, వైస్ ఎంపీపీ జైపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శ్రీనూపటేల్, ఎంఈవో రాములు, సీడీపీవో సునంద, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు